



రహదారిపై ప్యాచ్ వర్కు



కోతకు గురి కావడంతో దెబ్బతిన్న 340-సి జాతీయ రహదారి

● అన్నీ సగంలోనే..

జాతీయ రహదారి వెంట నిర్మిస్తున్న కల్వర్టులు, అండర్ ప్రొసెస్ బ్రిడ్జిల పనులు చాలా వరకు సగంలోనే ఉన్నాయి. ఎగువ పంటపొలాల్లోని వర్షపు నీరు వెళ్లేందుకు నిర్మిస్తున్న కల్వర్టులు ఉండాల్సిన ప్రదేశంలో కాకుండా ఇతర చోట్ల నిర్మించడంతో వర్షపు నీరు పొలాల్లో నిలిచిపోతోంది. జాతీయ రహదారి ఎగువన ఉన్న జలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. నిర్మాణాలు చేసిన కల్వర్టులు కూడా క్యూరింగ్ చేయలేదని, నాణ్యత పాటించలేదనే ఆరోపణలు వినిపిస్తున్నారు.

- వర్షాలకు కోతకు గురవుతున్న జాతీయ రహదారి
- తెలుగుగంగ కాలువకు ఉన్న మట్టి కుప్పలను వాడిన వైనం
- అనుమతులు లేకుండా ఎక్కడపడితే అక్కడ మట్టి తవ్వకాలు
- నాణ్యతను పట్టించుకోలేదనే విమర్శలు

నెర్రెల దారులు

నంద్యాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి)/ నందికొట్కూరు: బీటీ రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. కొద్దిపాటి వర్షాలకే నెర్రెలు వారుతున్నాయి. రోడ్ల కింద గొయ్యిలు పడుతున్నాయి. డోన్ టోల్‌గేట్ నుంచి ఆత్మకూరు వరకు 60 కిలోమీటర్ల మేర పి.ఎస్.కె కంపెనీ రెండు వర్క్‌ల కింద 340-సి జాతీయ రహదారి నిర్మాణాన్ని చేపట్టింది. అయితే పైన తారు రోడ్డు.. కింద గుంతలు... ఇదీ 340-సి జాతీయ రహదారి పరిస్థితి. ఇటీవలి వర్షాలకు 340-సి జాతీయ రహదారి సైడ్ బరంతి కోతకు గురవుతోంది. దీంతో పైన బీటీ రోడ్డు కనిపిస్తున్నా కింద మాత్రం పెద్ద గోతులు పడ్డాయి. కాంట్రాక్టర్ల లాభాపేక్ష, నాణ్యతలో నిర్లక్ష్యం దీనికి కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి. గార్గేయపురం, బ్రాహ్మణకొట్కూరు సరిహద్దుల్లో ఉన్న హంద్రీ నీవా కాలువ వద్ద నుంచి నందికొట్కూరు డిగ్రీ కళాశాల వరకు 340-సి రోడ్డు నిర్మాణ పనులను ఆంధ్రజ్యోతి పరిశీలించింది. కురిసిన వర్షాలకు 4, 5 చోట్ల రోడ్డు కోతకు గురైంది. వంతెనల వద్ద జాతీయ రహదారి కోతకు గురైంది. అలాగే పక్కన ఉన్న బరం వర్షాలకు కోతకు గురి కావడంతో రహదారిలో గుంతలు పడ్డాయి. అందులో భాగంగా బ్రాహ్మణకొట్కూరు-గార్గేయపురం మధ్యలో బ్రిడ్జి వద్ద దెబ్బతిన్న జాతీయ రహదారికి ప్యాచ్ వర్కులు చేస్తున్నారు. ఇలాంటి ప్యాచ్ వర్కు పనులు పలు చోట్ల దర్శనమిచ్చాయి. నాగలూటి క్రాస్ వద్ద బరంతి కోతకు గురి కావడంతో బీటీ రోడ్డుపైకి బాగా కనిపించినా కింద మట్టి కోతకు గురై అడుగుకు పైగా గొయ్యి పడింది. వర్షాకాలం ప్రారంభంలోనే ఇట్లా ఉంటే రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి ఏమిటనే ప్రశ్న వినిపిస్తోంది.

హంద్రీ నీవా కాలువ పూడ్చివేత..

కృష్ణానదికి వరద జలాలు భారీగా వస్తున్నాయి. దీంతో శ్రీశైలం జలాశయం నీటి మట్టం పూర్తి స్థాయికి చేరుకునేందుకు మరి ఎక్కువ రోజులు సమయం పట్టదు. ప్రస్తుతం శ్రీశైల జలాశయంలో 850 అడుగుల మేర నీటి మట్టం ఉంది. జూరాల, తుంగభద్ర డ్యాంల నుంచి వరద కొనసాగుతోంది. అధికారులు మల్యాల ఎత్తిపోతల పథకం ద్వారా హెచ్ఎన్ఎస్ఎస్ కాలువకు నీరు విడుదల చేస్తారని, నంద్యాల, కర్నూలు, అనంతపురం మూడు జిల్లాల ప్రజలు ఎదురు చూస్తున్నారు. అయితే బ్రాహ్మణకొట్కూరు-గార్గేయపురం మధ్యలో ఉన్న హెచ్ఎన్ఎస్ఎస్ కాలువపై వంతెన నిర్మించేందుకు తలపెట్టారు. దీని కోసం హెచ్ఎన్ఎస్ఎస్ కాలువను పూడ్చి వేసి రాకపోకలు సాగిస్తున్నారు. వంతెన స్లాబ్ పనులు ఇంకా కొనసాగుతున్నాయి. వంతెన స్లాబ్ సెట్ కావడానికి ఇంకా 20 రోజులు సమయం పడుతుంది. కానీ అధికారులు మాత్రం హెచ్.ఎన్.ఎస్.ఎస్ కాలువకు నీరు విడుదల చేస్తామని చెబితే పూడ్చిన కాలువను బాగు చేస్తామని అధికారులు చెబుతున్నారు. అలాగే వంతెనపై రాకపోకలకు అవకాశం ఉంటుందని కూడా చెబుతున్నారు.



వర్షానికి కోతకు గురైన జాతీయ రహదారి బరం మట్టి



సాగుతున్న వంతెన నిర్మాణం పనులు



హెచ్ఎన్ఎస్ఎస్ కాలువను పూడ్చిన దృశ్యం

అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు..

జాతీయ రహదారి పనులు ప్రారంభ దశలో అక్కడికక్కడ రైతుల నుంచి భూమిని కొనుగోలు చేసి మట్టిని ఎడాపెడా తవ్వేశారు. రెవెన్యూ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా నాటి ప్రభుత్వ నాయకుల అండదండలతో ఎక్కడపడితే అక్కడ మట్టిని తవ్వేసే ప్రయత్నం చేశారు. నందికొట్కూరు మండలం అల్లూరు వద్ద మట్టిని తవ్వే ప్రయత్నం చేయగా నాడు గ్రామస్తులు అడ్డుకోవడంతో అక్కడ వదిలేశారు. మిడ్తూరు మండలం నాగలూటి వద్ద రైతుల నుంచి భూములను కొనుగోలు చేసి రెవిన్యూ అనుమతులు లేకుండా మట్టిని అక్రమంగా తరలించారు. ఈ జాతీయ రహదారిలో అంతా ఎర్రమట్టి, తెలుగుగంగ కాలువ వెంట ఉన్న మొరం వేసి రోడ్డు నిర్మించారు. అయితే ఈ నిర్మాణంలో 40 ఎం.ఎం. కంకర వాడాలి. కానీ వారు ఈ కంకరను వాడిన దాఖలాలు కనిపించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. రోడ్డు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నా... కల్వర్టులు, అండర్ ప్రొసెస్ వంతెనల నిర్మాణాల్లో జాప్యం జరుగుతుందన్నది సుస్పష్టం.

● మా పొలాలకు దారి లేకుండా చేశారు



బైరాపురానికి వెళ్లే బాటలో నందికొట్కూరుకు సంబంధించి 300 ఎకరాలకు పైగా ఉంది. ఆ పొలానికి వెళ్లాలంటే ప్రస్తుతం హైవేపై వెళ్తున్నాము. హైవే ప్రారంభమైతే రైతులను రోడ్డు ఎక్కనివ్వరు. అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేస్తామని చెబుతున్నారే తప్ప.. చేయడం లేదు. నందికొట్కూరు నుంచి బైరాపురం వెళ్లే బాట ఇది. ఈ బాటవద్ద జాతీయ రహదారి వారు అండర్ ప్రొసెస్ బ్రిడ్జిని ఏర్పాటు చేస్తే రైతులకు సౌకర్యంగా ఉంటుంది. లేకపోతే రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

- కురువ పుల్లన్న నందికొట్కూరు

● లాభాపేక్ష కోసమే పనులు అన్నట్టుంది




సామాజిక భద్రత దృష్ట్యా 340-సి జాతీయ రహదారి నిర్మాణ పనులు జరగడం లేదు. కేవలం కంపెనీ లాభాపేక్ష కోసమే అన్నట్లుగా ఈ నిర్మాణం చేపట్టారు. అండర్ ప్రొసెస్ వంతెనలు, వర్షపు నీరు వెళ్లేందుకు నిర్మించిన కల్వర్టులకు క్యూరింగ్ చేయలేదు. మేము పరిశీలించిన సమయంలో ఈ విషయాన్ని గమనించాం. రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించలేదు. కాంట్రాక్టరు లాభాపేక్ష కోసం సాగుతోంది. మట్టి కోతకు గురవుతోంది. వంతెనల వద్ద చిన్న వర్షాలకే రహదారి కోతకు గురవుతోంది. క్వాలిటీ కంట్రోల్ వారి పర్యవేక్షణ కొరవడింది.


- నాగేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు

● రైతులకు ఇక్కట్లు..

నందికొట్కూరు రైతులకు తమ పొలాలకు వెళ్లేందుకు హైవే అడ్డంగా మారింది. నందికొట్కూరు రైతులు వీపనగండ్ల పాత రస్తా మీదుగా దాదాపు 400 ఎకరాలకు వెళ్లాల్సి ఉంది. అయితే ఇక్కడ అండర్ ప్రొసెస్ వంతెన నిర్మించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కాని అప్రోచ్ రోడ్డు మాత్రమే ఇస్తామని, అండర్ ప్రొసెస్ ఇవ్వలేమని జాతీయ రహదారి నిర్వాహకులు తమకు చెబుతున్నారంటూ రైతులు వాపోతున్నారు. రైతులకు తప్పకుండా అండర్ ప్రొసెస్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

10 గేట్లు ఎత్తి...





రాత్రి 9:30 గంటలకు పదిగేట్ల నుంచి నీటి విడుదల

సాయంత్రం 6 గంటల సమయంలో శ్రీశైలం జలాశయం ఏడు గేట్లు ఎత్తగా పరుగులు పెడుతున్న కృష్ణమ్మ

శ్రీశైలం, జూలై 30: ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ఉధృతి కొనసాగుతోంది. జూరాల, సుంకేశుల నుంచి వరద ప్రవాహం పెరగడంతో డ్యామ్ క్రస్టుగేట్లను మంగళవారం ఉదయం 11:30 గంటల సమయంలో 3 నుంచి 5 గేట్లు, సాయంత్రం 6 గంటలకు ఏడు గేట్లు ఎత్తగా.. రాత్రి 9:30 గంటలకు మూడు గేట్లు మొత్తం పది క్రస్టుగేట్లును 10 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువ నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. జూరాల నుంచి 2,81,698 క్యూసెక్కులు, సుంకేశుల నుంచి 97,945 క్యూసెక్కులు మొత్తం 3,88,460 వరద ప్రవాహం వస్తోంది. మంగళవారం సాయంత్రం 6 గంటల సమయానికి 4,13,178 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం జలాశయానికి చేరింది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 883.90 అడుగులుగా నమోదైంది.

భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలి : ఎస్పీ

ఉరుకుంద ఆలయంలో శ్రావణమాస ఉత్సవాలపై సమీక్ష

కౌతాళం, జూలై 30: ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో ఆగస్టు 5 నుంచి సెప్టెంబరు 2 వరకు జరిగే శ్రావణమాసపు ఉత్సవాలలో స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలని ఎస్పీ బిందుమాధవ్ దేవాలయ అధికారులకు తెలిపారు. మంగళవారం ఎస్పీ శ్రావణ మాసపు ఉత్సవాలకు ఏర్పాట్లను ఆదోని డీఎస్పీ శివనారాయణ స్వామి, ఆలయ ఈఓ వెంకటేష్‌తో కలిసి పరిశీలించారు. ముందుగా ఆలయ అధికారులు వారికి ఘనస్వాగతం పలికి స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేపట్టి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేసి పూలమాల శాలువాలతో సన్మానించారు. అనంతరం వారు ఆలయ పరిసరాలలో చేపడుతున్న ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించి భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించేలా ఏర్పాట్లను చేపట్టాలని తగు సూచనలు చేపట్టారు. ముఖ్యంగా తాగునీటి సమస్య, మహిళ భక్తులకు స్నానాల ఘాట్ల వద్ద ప్రత్యేక షెడ్లను ఏర్పాట్లు చేయాలని సూచించారు. వీరి వెంట కోసిగి సీఐ ప్రసాద్, ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి, సూపరిటెండెంట్‌లు వెంకటేశ్వర్లు, మల్లికార్జున, ఆలయ అర్చకులు ఈరప్ప స్వామి, మాహదేవ స్వామి ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువకుడి బలవన్మరణం

గోనెగండ్ల, జూలై 30: గోనెగండ్ల మండలంలోని ఎర్రబాడు గ్రామంలో బోయ లిక్కన్న(32) అనే యువకుడు కడుపునొప్పి తాళలేక ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ రామకృష్ణయ్య తెలిపిన మేరకు వివరాలు... మండలంలోని ఎర్రబాడు గ్రామానికి చెందిన బోయ లిక్కన్న గత కొన్ని మాసాలుగా కడుపు నొప్పితో బాధపడేవాడు. కుటుంబసభ్యులు పలు చోట్ల ప్రభుత్వ ప్రైవేట్ వైద్యుల దగ్గర వైద్యం చేయించారు. అయినప్పటికీ వ్యాధి నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం తెల్లవారుజామున గ్రామ పొలిమేర దగ్గర ఉన్న తన అన్న పొలంలోని వేప చెట్టుకు ఉరివేసుకున్నాడు. మృతుడి భార్య అరుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జల గలగలలు

సంగమేశ్వరంలో ఎగువ పుష్కరఘాట్‌ను ముంచెత్తుతున్న నదీజలాలు

ఆత్మకూరు, జూలై 30: సప్తనదీ సంగమ క్షేత్రం నదీజలాల శోభతో తొణికిసలాడుతోంది. కృష్ణ, వేణి, తుంగ, భద్ర, మలాపహరణి, భీమరథి, భవనాసి అనే ఏడు నదుల సంగమ ప్రదేశంలో వెలసిన సంగమేశ్వర క్షేత్రం ఇప్పటికే జలాధివాసమైంది. అయితే ఎగువ రాష్ట్రాల్లోని ప్రాజెక్టుల నుంచి శ్రీశైల జలాశయానికి భారీగా నీటి విడుదల జరుగుతున్న నేపథ్యంలోని సంగమేశ్వరంలో ఎగువ పుష్కర ఘాట్‌ను నదీజలాలు ముంచెత్తుతున్నాయి. సంగమేశ్వరాలయంలోని ఎగువ పుష్కరఘాట్ చివరి మెట్టు మాత్రమే కనిపిస్తోంది. ఎగువన ఉన్న ఉమామహేశ్వరాలయానికి అతిచేరువకు నదీజలాలు వస్తున్నాయి. కపిలేశ్వరం నుంచి సంగమేశ్వరానికి చేరుకునే రహదారి పక్కనే వున్న నదీతీరం వరకు జలాలు వచ్చిచేరాయి. దీంతో నదీజలాల సవ్వడులతో తొణికిసలాడుతున్న కృష్ణానది పరవళ్లను వీక్షించేందుకు సందర్శకులు సంగమేశ్వరానికి తరలివస్తున్నారు.



సప్తనదీ సంగమ క్షేత్రంలో నదీజలాలు



పీబీఆర్‌లోకి చేరుతున్న కృష్ణా జలాలు



రిజర్వాయరుకు ఇరువైపులా జలాలను తిలకిస్తున్న సందర్శకులు

వీబీఆర్‌కు భారీగా ఇన్‌ఫ్లో

వెలుగోడు, జూలై 30: తెలుగుగంగలో అంతర్భాగమైన వెలుగోడు జలాశయానికి రోజురోజుకూ ఇన్‌ఫ్లో భారీగా పెరుగుతోంది.. మంగళవారం సుమారు 12000 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ఎగువన కురిసిన భారీ వర్షాలకు ఆల్మట్టి, తుంగభద్ర, శ్రీశైలం జలాశయాలు పూర్తి స్థాయిలో నిండుకోవడంతో అధికారులు, ప్రజా ప్రతినిధులు పోతిరెడ్డిపాడు నుంచి నీటిని దిగవకు విడుదల చేశారు. ఈ నీరు బానకచెర్ల సముదాయం నుంచి వెలుగోడు జలాశయానికి చేరుకుంటుంది. జలాశయ పూర్తి సామర్థ్యం 16.95 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం జలాశయంలో 3.162 టీఎంసీలకు చేరుకుంది. జలాశయంలో రోజురోజుకూ నీటి మట్టం పెరుగుతోంది. ఈ జలాశయం శ్రీశైలం మహానంది వెళ్లే ప్రధాన రహదారిలో ఉండటంతో సందర్శకుల తాకిడి అధికమైంది.

రస్తా కోసం ఘర్షణ

● ఒకరికి తీవ్ర గాయాలు

ఎమ్మిగనూరు రూరల్, జూలై 30: ఎమ్మిగనూరు మండలంలోని పరమాన్‌దొడ్డి గ్రామంలో రస్తా విషయంలో మంగళవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘర్షణలో గొల్ల వెంకటేష్ తలకు తీవ్రరక్త గాయం కాగా, లక్ష్మీనారాయణ, మహానంది లకు స్వల్పగాయాలయ్యాయి. గ్రామానికి చెందిన చాకలి పెద్దరోగెప్ప, చాకలి చిన్న రోగెప్పలకు, గొల్ల వెంకటేష్, లక్ష్మీనారాయణ, మహానంది మధ్య పొలం రస్తా విషయంలో గత కొన్ని రోజులుగా వివాదం జరుగుతుంది. ఈ విషయం గతంలో పోలీస్ స్టేషన్ వరకు వెళ్లింది. అయితే మంగళవారం పొలం దగ్గర పాతకాలం నుంచి ఉన్న రస్తాను చాకలిపెద్ద రోగెప్ప, చాకలి చిన్న రోగెప్ప లతో పాటు మరికొంతమంది చదును చేసే తమ పొలంలోకి కలుపుకునేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న గొల్ల వెంకటేష్, లక్ష్మీనారాయణలతో పాటు మరికొంతమంది ఎప్పటి నుంచో ఉన్న రస్తాను తొలగిస్తే మేము పొలాలకు ఎలావెళ్లాలంటూ ప్రశ్నించారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. వాగ్వాదం కాస్తా పెద్దదై ఘర్షణకు దారితీసింది. దీంతో చాకలి పెద్ద రోగెప్ప, చాకలి చిన్న రోగెప్ప, గుడిసె నరసన్న, రామాంజ నేయులు, వెంకటేష్, చంద్ర, తాయప్ప గొల్ల వెంకటేష్, లక్ష్మీనారాయణ, మహానందిలపై కర్రలతో దాడి చేశారు. ఈదాడిలో గొల్ల వెంకటేష్ తలకు తీవ్ర రక్తగాయమైంది. వారిని మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు రెఫర్ చేశారు. ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాధితులు గొల్ల వెంకటేష్ బంధువులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చాకలి చిన్న రోగెన్న, రామాంజ నేయులు, వెంకటేష్, చంద్ర, తాయప్పలపై కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇన్నోవాలో వచ్చి మేకల చోరీ

ఎమ్మిగనూరు రూరల్, జూలై 30: ఎమ్మిగనూరు మండల పరిధిలోని బోడబండ గ్రామంలో దొంగలో ఇన్నోవా కారులో వచ్చి మేకలను దొంగలించిన సంఘటన మంగళవారం తెల్లవారు జామున 2గంటలకు జరిగింది. బాధితుడు బైంటింటి గోపాల్ తెలిపిన వివరాల మేరకు... ఆయన తనకున్న రెండు మేకలను ఇంటి బయట ఆవరణలో కట్టివేశారు. రోడ్డుపక్కనే తన ఇల్లు ఉండడంతో రాత్రి 2గంటల సమయంలో ఇన్నోవా కారులో వచ్చిన కొంతమంది దుండగులు రెండు మేకలను దొంగలించుకెళ్లాడని ఆయన తెలిపారు.

బటన్ నొక్కి మెక్కేసిన సొమ్మును కక్కిస్తాం

● టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కేఈ క్రిష్ణమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న కేఈ క్రిష్ణమూర్తి

కర్నూలు(అర్బన్), జూలై 30: గత ఐదేళ్ల కాలంలో వైఎస్ జగన్ సీఎం హోదాలో బటన్ నొక్కి కాజేసిన ప్రజల సొమ్మును కక్కిస్తామని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ ఉపముఖ్యమంత్రి కేఈ క్రిష్ణమూర్తి అన్నారు. మంగళవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆకేపోగు ప్రభాకర్, వై నాగేశ్వరరావు యదవ్‌లతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి అధికారాన్ని అడ్డం పెట్టుకుని దోచేసిన ప్రజాధనాన్ని తిరిగి రప్పిస్తామని, పేదలకు, బీదలకు సద్వినియోగ పరిచేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ దిశగా ముందుకు వెళుతున్నారని తెలిపారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వేలాది ఎకరాల ప్రజల భూములను బినామీల పేర్లతో అక్రమించుకున్నారని అన్నారు. తన అక్రమాలు బయట పడతాయనే ఉద్దేశంతో సబ్ కలెక్టర్ కార్యాలయంలోని ఫైళ్లను తగుల బెట్టించడమే కాకుండా లెక్కకు మించిన ఫైల్స్ తన పీఏ ద్వారా హైదరాబాద్‌కు తరలించారని, ట్రంకు పెట్టెల్లో వాటిని దాచారని, ఇది పోలీసుల సోదాలో బయట పడిందని తెలిపారు. ఈ సమావేశంలో సంత్రం రామక్రిష్ణుడు, సోమిశెట్టి నవీన్, జేమ్స్, ఎస్‌కే బషీర్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

డోన్(రూరల్), జూలై 30: డోన్‌లో గంజాయి విక్రేతలను పోలీసులు అరెస్టు చేశారు. అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన రామదాస్ అనే వ్యక్తి అతని అనుచరుడు మోక్షిత్‌తో కలిసి డోన్ పట్టణం సమీపంలోని కొత్తపల్లి బ్రిడ్జి వద్ద గంజాయి విక్రయిస్తుండగా.. వచ్చిన సమాచారం మేరకు దాడులు చేసి అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ ప్రవీణ్ తెలిపారు. డోన్ పట్టణం పాతపేటకు చెందిన పవన్ 1200 గ్రాముల గంజాయిని తరలిస్తుండగా.. దాడులు చేసి స్వాధీన చేసుకున్నట్లు తెలిపారు. దాని విలువ రూ.25వేలకు పైగా ఉంటుందన్నారు. నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ గంజాయిని పాతపేటకు చెందిన అర్జున్, పవన్ పలు ప్యాకెట్ల ద్వారా అమ్ముతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో పట్టణ ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి కిడ్నాప్ కలకలం

డోన్(రూరల్), జూలై 30: డోన్ మండలం చిన్నమల్కాపురం గ్రామానికి చెందిన మధు కుమార్ అనే యువకుడు బ్యాంకాక్‌లోని థాయ్‌లాండ్‌లో కిడ్నాప్‌కు గురయ్యాడని సమాచారం. గత కొద్ది రోజుల కింద ఇతను కిడ్నాప్‌కు గురైన విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు. మధు కుమార్ సోదరి రాజ్యలక్ష్మి ఈ నెల 28వ తేదీన డోన్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రూరల్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. డోన్ రూరల్ ఎస్ఐ, సిబ్బంది బెంగళూరు వెళ్లి మధు కుమార్ ఆరోగ్య వివరాలు సేకరించారు. అధిక జీతాలు వస్తాయన్న ఉద్దేశంతో మధుకుమార్ బ్యాంకాక్ వెళ్లినట్లు తెలుస్తోంది. ఘటనపై రూరల్ సీఐ అబ్రజత్‌బాషా మాట్లాడుతూ బ్యాంకాక్‌లో ఈ సంఘటనపై చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

రోగి ప్రాణం కాపాడిన వైద్యులు

వెలుగోడు, జూలై 30: ఓ వ్యక్తికి అనుకోకుండా ఛాతి నొప్పి వచ్చింది. వెలుగోడు వైద్యశాలకు చేరుకున్న ఆ వ్యక్తిని పరీక్షించిన వైద్యులు గుండెపోటు వచ్చిందని నిర్ధారించి రూ.40 వేల విలువ చేసే సూది మందు వేసి ప్రాణాపాయం నుంచి కాపాడారు. ఈ సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. వెలుగోడు మండలంలోని గుంతకందాల గ్రామానికి చెందిన మార్క్ అనే యువకునికి ఛాతి నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే వెలుగోడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో వైద్యాధికారి ఇక్రమ్ అలిఖాన్ పరీక్షించి గుండెపోటు వచ్చిందని నిర్ధారించారు. వెంటనే రూ.40 వేల విలువ చేసే ఎలాగ్జిమ్ 40 అనే సూది మందు వేసి ప్రాణాపాయం నుంచి తప్పించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.

సీఎం చంద్రబాబు పర్యటనపై కలెక్టర్ సమీక్ష



సమీక్షిస్తున్న కలెక్టర్

శ్రీశైలం, జూలై 30: ఆగస్టు ఒకటో తేదీన సీఎం నారా చంద్రబాబు నాయుడు శ్రీశైలం పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ జి. రాజకుమారి జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం దేవస్థానం సీసీ కంట్రోల్ గదిలో జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్, జేసీ సి. విష్ణుచరణ్, దేవస్థానం కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజుతో కలిసి సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీశైలం క్షేత్ర పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను విజయవంతం చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఒకటో తేదీన ఉదయం 9.50 గంటలకు సుండిపెంట హెలిప్యాడ్‌కు చంద్రబాబు చేరుకుంటారన్నారు. అనంతరం శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను దర్శించుకుని, శ్రీశైలం ప్రాజెక్టుకు జలహారతి ఇస్తారన్నారు. అనంతరం జలాశయం కుడిగట్టు జలవిద్యుత్ కేంద్రం సందర్శన, సుండిపెంటలోని వాటర్ యూజర్స్ అసోసియేషన్‌తో ముఖాముఖి నిర్వహిస్తారని తెలిపారు.

బంగారు నగల వ్యాపారి సురక్షితం

- కిడ్నాప్‌ను ఛేదించిన పోలీసులు
- పోలీసుల అదుపులో నిందితుడు, స్కార్పియో వాహనం
- మరో ఇద్దరి కోసం గాలింపు

గూడూరు, జూలై 30: గూడూరు పట్టణంలో బంగారు నగల వ్యాపారి కిడ్నాప్‌ను పోలీసులు చాలెంజ్‌గా తీసుకొని పన్నెండు గంటల లోపే ఛేదించి నగర వ్యాపారిని సురక్షితంగా కాడపాడారు. సోమవారం గూడూరు పట్టణంలో డమాం వెంకటేశ్వర్లును ఎమ్మిగనూరు రోడ్డులో దాల్ మిల్ దగ్గర గుర్తు తెలియని దుండగులు కిడ్నాప్ చేసిన సంఘటన తెలిసిందే. కిడ్నాప్ సంఘటన తెలిసిన వెంటనే కోడుమూరు సీఐ మన్సురుద్దీన్, గూడూరు, కోడుమూరు, కె.నాగలాపురం ఎస్ఐలు హనుమంతయ్య, బాలనరసింహులు, శ్రీనివాసులు పోలీసు సిబ్బందితో బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. నగర వ్యాపారి డమాం వెంకటేశ్వర్లును అపహరించిన దుండగులు అతని సోదరునికి ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేయడంతో స్కార్పియో వాహనం ఎక్కడెక్కడ తిరుగుతుందన్నది సీసీ పుటేజీ ద్వారా పోలీసులు పరిశీలించారు. అలాగే ఫోన్ సిగ్నల్ ఎక్కడి నుండి వచ్చింది, ఎక్కడ ఫోన్ సిగ్నల్ నిలిచింది అన్నది పోలీసులు పరిశీలించారు. దుండగులు వాహనంలో పొలాల్లో విండ్ పవర్ ఫ్యాన్ల కోసం వేసిన రోడ్లపై తిరుగుతూ పోలీసులకు చిక్కకుండా తప్పించుకునే ప్రయత్నం చేశారు. అయితే పోలీసులు ఫోన్ సిగ్నల్ ఆధారంగా పొలాల్లో వేసిన దారులతోపాటు మెయిన్ దారులను కట్టడి చేశారు. చివరకు మంగళవారం తెల్లవారు జామున ప్యాలకుర్తి సమీపంలో కాలువ వెంట స్కార్పియో వాహనం వస్తున్నది గమనించిన కె.నాగలాపురం ఎస్ఐ శ్రీనివాసులు తమ వాహనాన్ని అడ్డు పెట్టబోగా దుండగులు పోలీసు వాహనాన్ని ఢీకొట్టే ప్రయత్నం చేశారు. పోలీసులు చాకచక్యంగా దుండగుల వాహనాన్ని పట్టుకున్నారు. వాహనంలో ఉన్న దుండగులు తప్పించుకునే ప్రయత్నం చేయగా అందులో ఒక వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరు పారిపోయారు. వాహనంలో ఉన్న బాధితుడు డమాం వెంకటేశ్వర్లును రక్షించారు. అయితే కిడ్నాప్ సమయంలోనే డమాం వెంకటేశ్వర్లును దుండగులు గాయపరిచినట్లు గుర్తించారు. పట్టుబడిన నిందితుడు నుంచి రాబట్టిన సమాచారం మేరకు తప్పిచుకున్న వారి కోసం పోలీసులు గాలింపు చర్యలను తీవ్రతరం చేశారు.



కిడ్నాపర్ల చేతిలో గాయపడిన డమాం వెంకటేశ్వర్లు

టిడ్కో కాలనీ ఆవరణలో మహిళా మార్ట్

● రూ.1.66 కోట్లతో నిర్మాణం ● నేడు శంకుస్థాపన చేయనున్న మంత్రి ఫరూక్

నంద్యాల టౌన్, జూలై 30 : నంద్యాల మున్సిపా లిటీ పరిధిలో ఎస్ఆర్‌బీసీ కాలనీ టిడ్కో గృహాల ఆవరణ లో రూ.1.66 కోట్లతో మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేసేందు కు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. ఏపీ నివాస సముదాయం, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టిడ్కో), నంద్యాల పురపాలక సంఘం పీఎంఏవై (అర్బన్) సంయుక్త ఆధ్వర్యంలో మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేయనున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయంలో నంద్యాలలో పది వేల టిడ్కో గృహాలను నిర్మించేందుకు సంకల్పించి అందులో దాదాపు 85 శాతం పనులను పూర్తి చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక టిడ్కో గృహాల పూర్తిని గాలికి వదిలేసి, ఈ ఏడాది ఎన్నికల నేపథ్యంలో 250 గృహాలను మాత్రమే లబ్ధిదారులకు ఇచ్చి చేతులు దులుపుకుంది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే అర్హులందరికీ ఇళ్లు ఇవ్వడానికి టిడ్కో గృహాలను వీలైనంత త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎస్ఆర్‌బీసీ కాలనీ ఆవరణలోని టిడ్కో గృహ సముదాయంలో దాదాపు నాలుగు వేల గృహాలు ఉన్నాయి. వచ్చే కొద్ది నెలల కాలంలో మొత్తం గృహాల్లో లబ్ధిదారులను చేర్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో ఇక్కడ నివాసం ఉండే వారికి నిత్యావసర సరుకుల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేకంగా మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దాదాపు రూ.1.66 కోట్లతో మహిళా మార్ట్‌ను నిర్మించనున్నారు. ఈ నెల 31వ తేదీన రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, న్యాయ శాఖా మంత్రి ఎన్ఎండీ ఫరూక్ శంకు స్థాపన చేయనున్నట్లు కమిషనర్ నిరంజన్‌రెడ్డి తెలిపారు. శంకుస్థాపన ఏర్పాట్లను మంగళవారం కమిషనర్‌తోపాటు పురపాలక ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది పరిశీలించారు.



శంకుస్థాపన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్

టీడీపీతోనే పేదల సొంతింటి కల సాకారం

నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, జూలై 30: పేదవారి సొంతింటి కల టీడీపీతోనే సాధ్యమని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని హుస్సేనాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజశేఖర్ మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చేసరికి ప్రభుత్వ ఖజానాలో పైసా కూడా లేదని ఏ శాఖలో చూసినా అప్పులే కనపడుతున్నాయని అన్నారు. అందరికీ ఇళ్లు అనే నినాదంతో చంద్రన్న ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని అన్నారు. చంద్రబాబు ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు అందజేస్తుందని అన్నారు. ఇందులో ప్రభుత్వం వాటా రూ.1.50, కేంద్రం వాటా రూ.2.50 లక్షలు ఇవ్వనుందన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకుడు మహబూబ్‌బాషా, కాపు సంఘం నాయకుడు కెవి. మధు, బజారు, వేణు పాల్గొన్నారు.

పంచాయితీ కార్యదర్శుల సస్పెన్షన్‌కు సిఫారసు

కర్నూలు(కలెక్టరేట్), జూలై 30: పంచాయితీరాజ్‌శాఖ నిర్దేశించిన పనులు నిర్వహించడంలో పూర్తి నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించిన ఆస్పరి మండలంలోని పంచాయితీ కార్యదర్శులు వెంకటేశ్, నబీ సాహేబ్, రామ్మూర్తి, సురేష్‌లపై సస్పెన్షన్‌కు డీపీవో నాగరాజు నాయుడు జిల్లా కలెక్టర్‌కు సిఫారసు చేశారు. ఓడీఎఫ్ సర్వే, పీఆర్‌వన్ యాప్ లక్ష్యాలను సాధించడంలో ఆస్పరి మండలంలోని పంచాయితీ కార్యదర్శులు పూర్తి ఉదాసీనతతో ఉన్నారనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. డీపీవో కార్యాలయంలో సమీక్ష సమావేశానికి హాజరు కావాలని ఆదేశించినా కొందరు పంచాయితీ కార్యదర్శులు గైర్హాజరు కావడాన్ని ఆయన తప్పు పట్టారు. అధికారుల ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు సిఫారసు చేశారు.

ఆర్‌యూలో పలువురికి బాధ్యతలు

కర్నూలు(అర్బన్), జూలై 30: రాయలసీమ యూనివర్సిటీలో ఇన్‌చార్జి ఉపకులపతి ఎన్‌టీకే నాయక్ పలువురు ఆచార్యులకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆర్ట్స్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్స్‌పాల్‌గా తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య ఎన్.నరసింహులు, ఎకనామిక్ విభాగ సమన్వయకర్తగా అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్.శ్రీధర్‌లకు బాధ్యతలు అప్పగించారు.

చట్ట వ్యతిరేకంగా ప్రవర్తిస్తే చర్యలు

● ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల క్రైం, జూలై 30 : చట్ట వ్యతిరేకంగా ప్రవర్తించేవారిపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా వెల్లడించారు. మంగళవారం జిల్లాలో నేర నివారణే లక్ష్యంగా చేపట్టిన వివిధ చర్యల గురించి ఎస్పీ వివరించారు. జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో మట్కా, జూదం, అక్రమ మద్యం, ఇసుక, డ్రంక్ అండ్ డ్రైవ్, రోడ్డు ప్రమాదాల నివారణకు మోటార్ వెహికల్ యాక్టును కట్టుదిట్టంగా అమలు చేస్తామని అన్నారు. లాడ్జిలను క్రమం తప్పకుండా తనిఖీ చేయడానికి కార్యాచరణకు దిగుతామని అన్నారు. ఇందులో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 9 కేసులు నమోదు చేశామని, ఎన్‌ఫోర్స్ మెంట్‌లో భాగంగా 68 ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేశామని తెలిపారు. మోటార్ వెహికల్ చట్టం అమలు చేసి 212 కేసులు నమోదు చేసి రూ.63,120 జరిమానా విధించినట్లు తెలిపారు. అడిషనల్ ఎస్పీ పర్యవేక్షణలో సెబ్ అధికారు లు, సివిల్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో అక్రమ మద్యంపై 11 డీపీఎల్ కేసులలో నాటు సారా కేసులు నమోదు చేసి 80 లీటర్లు స్వాధీనం చేసుకోవడంతోపాటు 94 (90 ఎంఎల్) మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

చివరి ఆయకట్టు ప్రశ్నార్థకం

- నందికొట్కూరు నియోజకవర్గంలో మరమ్మతులకు గురైన ఎత్తిపోతల పథకాలు
- కొన్ని గ్రామాలకే అందుతున్న నీరు
- ఆందోళనలో అన్నదాతలు
- మైనర్ రిపేరీల భారమంతా రైతుల పైనే..



నాగటూరు ఎత్తిపోతల పథకం పంప్ హౌస్

నందికొట్కూరు రూరల్, జూలై 30: నందికొట్కూరు నియోజకవర్గం పరిధిలో ఆరు ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. గతంలో టీడీపీ హయాంలో నిర్వహణ చేపట్టేవారు. అయితే వైసీపీ హయాంలో కనీస మరమ్మతులకు కూడా నిధులను మంజూరు చేయలేదు. దీంతో ఆ మొత్తం అంతా రైతుల మీదనే భారం పడినట్లయిందని రైతులు వాపోతున్నారు. ఎకరాకు కొంత చొప్పున డబ్బులు వసూలు చేసుకుని నడుపుకోవాల్సి వస్తోందని ఎత్తిపోతల పథకాల కింద రైతులు ఆవేదన చెందుతున్నారు.

నందికొట్కూరు మండలంలోని నాగటూరు ఎత్తిపోతల పథకం ఫేస్-1 కింద పారుదల 4900 ఎకరాలు. అంచనా రూ.1536 లక్షలు. రెండు పంపులు 72 క్యూసెక్కుల సామర్థ్యంతో పనిచేస్తాయి. ఈ పథకం కింద లబ్ధి పొందే గ్రామాలు నాటూరు 1000 ఎకరాలు, కొనిదేల 370 ఎకరాలు, పగిడ్యాల 930 ఎకరాలు, లక్ష్మాపురం 2000 ఎకరాలు, మండ్లెం 600 ఎకరాలు, మొత్తం 4900 ఎకరాల ఆయకట్టుకు నీరందించే విధంగా రూపకల్పన చేశారు. అయితే ఇప్పటికీ పూర్తి లక్ష్యం నెరవేరలేదు.

నాగటూరు ఎత్తిపోతల ఫేస్-2 కింద పారుదల 4900 ఎకరాలు. అంచనా రూ.1600 లక్షలు. రెండు పంపులు 72 క్యూసెక్కుల సామర్థ్యం గలవు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందే గ్రామాలు మద్దిగట్ల 2000 ఎకరాలు, నందికొట్కూరు 930 ఎకరాలు, మల్యాల 600 ఎకరాలు, మండ్లెం 1000 ఎకరాలు, తర్తూరు 370 ఎకరాల పారుదల లక్ష్యంగా ఈ పథకాన్ని న్మించారు. అయితే ఇందులో సగం కూడా నీరందించడంలేదు. నాగటూరు ఎత్తిపోతల పథకం కింద కొన్ని గ్రామాలకే నీరందుతోంది. తర్తూరు, నందికొట్కూరు ప్రాంతంలో ఎక్కువభాగం నీరందక రైతులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు.

ప్రస్తుతం జూపాడు బంగ్లా ఎత్తిపోతల పథకంలో ఫేస్ 1, ఫేస్-2 పథకాలు పనిచేస్తుండగా.. అందులో మోటర్లు మేజర్ రిపేరు అయ్యాయని అధికారులు చెబుతున్నారు. అలాగే నాగటూరు ఎత్తిపోతల కింద కూడా ఫేస్ 1, ఫేస్ 2 పథకాలు పని చేస్తున్నాయి. వీటి కింద కూడా దాదాపుగా 9 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇందులో కేవలం 5వేల ఎకరాలకు మాత్రమే నీరు అందుతోంది. అలాగే సంగమేశ్వరం ఎత్తిపోతల, లింగాల ఎత్తిపోతల పథకలాలు కూడా ఇదే తరహాలో ఉన్నాయి.

ప్రస్తుతం ఎగువ రాష్ట్రాలో కురుస్తున్న వర్షాల వల్ల శ్రీశైలం ప్రాజెక్టులో నీరు ఆశాజనకంగా చేరుతోంది. నందికొట్కూరు నియోజకవర్గంలోని అన్ని ఎత్తిపోతల పథకాలకు నీరు అందుతోంది. దీంతో రైతులు ఎన్నో ఆశలతో కొండంత ఆశలతో నీటి విడుదల కోసం ఎదురు చూస్తున్నారు. అయితే ఎప్పటిలాగే ఇక్కడ ఉన్న ప్రాంతీయ రైతులను విస్మరించి ఎక్కడో ఉన్న మద్రాసు, కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాల రైతులకు నీటిని విడుదల చేసేందుకు ముందుగా నీటిని విడుదల చేస్తారు. ఇక్కడ వున్న రైతులకు ఇక్కడ నిర్మించిన ఎత్తిపోతలపై దృష్టి పెట్టి వాటిని మరమ్మతులు చేయించి పనిచేయించి రైతులకు నీరందించాలని స్థానిక రైతులు కోరుతుతున్నారు.



నాగటూరు ఎత్తిపోతలకు శ్రీశైలం బ్యాక్ వాటర్‌ను అందించే అప్రోచ్ కెనాల్

ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, రాజు మాట్లాడుతూ నందికొట్కూరు నియోజకవర్గంలో ఎత్తిపోతల పథకాలపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదని అన్నారు. కనీసం పథకాల నిర్వహణ కోసం నిధులు మంజూరు చేయడం లేదని అన్నారు. ఇక్కడ పనిచేసే వాచ్ మెన్‌కు, ఆపరేటర్లకు కూడా వేతనాలు ఇవ్వకపోవడంతో రైతులపై భారం పడుతోందని అన్నారు. రైతులు ఎకరాకు కొంత డబ్బు ఇవ్వకపోతే ఈ పతకాలు నిలిచిపోతాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు మేలు కొని రైతులపై భారం పడకుండా చూడాలన్నారు.

రైతుల భాగస్వామ్యంతో నడుపుతున్నాం

నాగటూరు ఎత్తిపోతల పథకం రైతుల భాగస్వామ్యంతో నడుపుతున్నాం. ఎకరాకు కొంత మొత్తం రైతుల వద్ద వసూలు చేసి ఇక్కడ పనిచేస్తున్న వాచ్‌మన్, ఆపరేటర్లకు వేతనం ఇస్తున్నాం. మేజర్ సమస్యలు తలెత్తితే ప్రభుత్వానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం.

నారాయణరెడ్డి, ఏఈ, నాగటూరు ఎత్తిపోతల పథకం

చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదు



రైతు సుధాకర్ మాట్లాడుతూ నందికొట్కూరు పొలిమేరలో నాగటూరు ఎత్తిపోతల పథకం కింద నాకు మూడు ఎకరాల పొలం ఉంది. నాగటూరు ఎత్తిపోతల నీరు అందాలంటే నీరందించే డిస్ట్రిబ్యూటరీలు సరిగ్గా పనిచేయకపోవడంతో నీరు చివరి ఆకట్టుకు అందడంలేదు. దీంతో దాదాపుగా నందికొట్కూరు, తూర్తురు పొలిమేరలో దాదాపుగా మూడు వేల ఎకరాలకు నీరు అందడం లేదు.

సుధాకర్, రైతు, నందికొట్కూరు

రైతులకు అండగా టీడీపీ ప్రభుత్వం: ఎమ్మెల్యే



ఫోన్‌లో కేసీ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

గడివేముల, జూలై 30: టీడీపీ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. కుందూనదికి నీళ్ల వదలేలా చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో రైతులు మంగళవారం ఎమ్మెల్యే గౌరుచరితను కలిశారు. వర్షాలు సకాలంలో పడటంతో కుందూనది పరివాహక ప్రాంతంలో మొక్కజొన్న, సోయా చిక్కుడు, పత్తి పంటలను సాగు చేశామని అన్నారు. కుందూనదికి నీళ్ల రాకపోవడంతో పంటలు ఎండుముఖం పట్టాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. బానకచర్ల రెగ్యులేటర్ నుంచి అలగనూరు రిజర్వాయర్ మీదుగా నీటిని మళ్లించి కుందూనదికి నీళ్ల వదలాలని కోరారు. రైతుల సాగునీటి సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే గౌరుచరిత ఫోన్‌లో కేసీ కెనాల్ ఉన్నతాధికారులను సంప్రదించారు. రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో రైతులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సోనా మసూరి బియ్యం ఎగుమతికి చర్యలు తీసుకోవాలి: ఎంపీ

నంద్యాల (నూనెపల్లె), జూలై 30: కర్నూలు, నంద్యాల సోనామసూరి బియ్యం ఎగుమతికి చర్యలు తీసుకోవాలని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి కోరారు. మంగళవారం లోక్‌సభలో కేంద్ర వ్యవసాయ, పరిశ్రమల శాఖ మంత్రుల దృష్టికి సమస్యలను తీసుకువచ్చారు. జిల్లాలోని పాణ్యం ఉద్యాన పూలతోటలకు నర్సరీల ఆధునికీరణ కోసం రైతులను కేంద్ర ప్రోత్సహించేందుకు కృషి చేయాలని కోరారు. గత ఐదేళ్ళలో వ్యవసాయం, పరిశ్రమల అభివృద్ధిపై కర్నూలు, నంద్యాల సోనా మసూరి బియ్యం ఉత్పత్తికి సంబంధించి గత వైసీపీ ప్రభుత్వం చిన్న చూపు చూసిందని అన్నారు.

నేటి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాయిదా

ఆత్మకూరు, జూలై 30: ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో జూలై నెలకు సంబంధించి బుధవారం జరగాల్సిన కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేసినట్లు కమిషనర్ హరిప్రసాద్ మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆగస్టు 1వ తేదీన శ్రీశైలానికి సీఎం చంద్రబాబు రానున్న నేపథ్యంలో కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ విషయాన్ని కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ఎక్స్‌అఫీషియో సభ్యులు గమనించాలన్నారు.

తెలంగాణ మద్యం పట్టివేత

నందికొట్కూరు, జూలై 30: నందికొట్కూరు పట్టణంలో తెలంగాణ మద్యం బాటిళ్లను ఎక్సైజ్‌శాఖ అధికారులు సీజ్ చేశారు. సెబ్ సీఐ సీతారామిరెడ్డి తెలిపిన వివరాలివీ.. పట్టణంలోని సుబ్బారావుపేటలో లోకేశ్వరుడు అనే వ్యక్తి ఇంటి వద్ద తెలంగాణకు చెందిన 14 క్వార్టర్ బాటిళ్లు, 11 (375 ఎంఎల్)లను అక్రమంగా విక్రయం చేస్తుండడంతో స్వాధీనం చేసుకున్నారు. లోకేశ్వరుడిని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో నంద్యాలకు చెందిన డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ విజయకుమార్, ఎస్ఐ నాగరాజు, మోహన్‌కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులపై విచారణ

జూపాడుబంగ్లా, జూలై 30: తాటిపాడు, జూపాడుబంగ్లా గ్రామాల్లో జరిగిన ఉపాధి పనుల్లో ఉపాధి సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు అవకతవకలకు పాల్పడ్డారని ఈనెల 20న జరిగిన సామాజిక తనిఖీ బహిరంగచర్చ వేదికలో ఫిర్యాదులపై మంగళవారం అంబుడ్స్‌మెన్ సురేంద్రకుమార్ విచారణ చేపట్టారు. గ్రామ సచివాలయాల్లో ఉపాధిసిబ్బంది, ఫీల్డ్ అసిసెంట్లు, ఉపాధి కూలీలను సమావేశపరచి ఫిర్యాదులపై ఇరుపక్షాలను అడగి తెలుసుకున్నారు. ఎంపీడీవో నూర్జహన్, ఏపీవో గౌరిబాయి, ఈసీ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీకి చర్యలు

నంద్యాల రూరల్, జూలై 30: ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమ పర్యవేక్షణకు నంద్యాల మండలానికి ఆరుగురు ప్రత్యేకాధికారులను నియమించినట్లు ఎంపీడీవో సౌబాగ్యమ్మ మంగళవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ 17 గ్రామ సచివాలయాలలో పింఛన్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

బీసీల సంక్షేమానికి కృషి: మంత్రి

నంద్యాల (నూనెపల్లె), జూలై 30: రాష్ట్రంలో బీసీల సంక్షేమానికి టీడీపీ కట్టుబడి ఉందని రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. రాష్ట్రంలోని బీసీల సామాజిక వర్గాలతో పాటు అన్ని సామాజిక వర్గాల సంక్షేమానికి చంద్రబాబు నాయుడు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. మంగళవారం జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు శేషాద్రి గౌడ్ ఆధ్వర్యంలో నంద్యాలలోని టీడీపీ కార్యాలయంలో మంత్రి ఫరూక్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. సంఘం నాయకులు ఫరూక్‌కు పుష్పగుచ్చం, శాలువాతో సన్మానించారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు శివశంకర్ యాదవ్, వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొన్నారు.

'ఆ సీఆర్పీలను తొలగించాలి'

పొదుపు లక్ష్మి సంఘాల మహిళల నుంచి రూ.లక్షలు కాజేసి ప్రభుత్వ పారితోషికం అందుకుంటూ వైసీపీ కండువాలు వేసుకుని ఎన్నికల్లో ప్రచారం చేసిన సీఆర్పీలపై చర్యలు తీసుకోవాలని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అధికారులను ఆదేశించారు. ఓ చానల్‌లో తనపై అసత్య కథనాలు ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. నంద్యాలలోని టీడీపీ కార్యాయలంలో మంత్రి ఫరూక్‌కు వినతులు వెల్లువెత్తాయి. మన ఊరు మన బాధ్యతకు సంబంధించి అన్ని వార్గ లప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని మంత్రి దృష్టికి తీఉకువచ్చారు.

మంత్రిని కలిసిన వడ్డె ఓబన్న సేవా సమితి సభ్యులు

గడివేముల: మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను మంగళవారం అఖిలభారత వడ్డె ఓబన్న సేవా సమితి సభ్యులు కలిశారు. జిల్లా అధ్యక్షుడు బీవీఎన్ రాజు, ఉపాధ్యక్షులు చిన్న, సభ్యులు పాల్గొన్నారు.



మంత్రి ఫరూక్‌ను సన్మానిస్తున్న జిల్లా గౌడ సంఘం నాయకులు



మంత్రిని కలిసిన అఖిల భారత వడ్డె ఓబన్న సేవా సమితి సభ్యులు

రైతులపై భారం పడనివ్వం: ఎమ్మెల్యే

నందికొట్కూరు రూరల్ జూలై 30: రైతులపై పైసా భారం పడనివ్వబోమని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. నందికొట్కూరు మండలం నాగటూరు వద్ద గల మల్యాల ఫేస్1, ఫేస్2 ఎత్తిపోతల పథకం నుంచి మంగళవారం ఎమ్మెల్యే రైతుల సమక్షంలో నీటిని విడుదల చేశారు. నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య నాగటూరు వద్ద గల మల్యాల ఎత్తిపోతల పథకం వద్ద పంపింగ్ స్టేషన్‌లో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ఎత్తిపోతల పథకం నీటి పారుదల శాఖ అధికారులు డీఈ నాగార్జునరావ్, ఏఈ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఎత్తిపోతల పథకం ఫెస్1 నుంచి ఒక పంపు ద్వారా 36 క్యూసెక్కుల నీటిని, ఫేస్2 పథకం నుంచి మరో పంపు ద్వారా 36 క్యూసెక్కుల నీటిని మొత్తం 72 క్యూసెక్కుల నీటిని స్విచ్ ఆన్ చేసి విడుదల చేశారు. ఎమ్మెల్యే జయసూర్య మాట్లాడుతూ ఎత్తిపోతల పథకాల నిర్వహణ కోసం గత వైసీపీ ప్రభుత్వం రైతుల నుంచి డబ్బులు వసూలు చేసిందని, తమ ప్రభుత్వంలో ఒక పైసా కూడా భారం పడనివ్వబోమని అన్నారు. రిపేర్ల ఖర్చులు, నిర్వహణ విషయమై నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామనాయుడు దృష్టికి కూడా తీసుకుని వెళ్లామని, దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని అన్నారు. నిధులు మంజూరు చేయించి అన్ని ఎత్తిపోతల పథకాలను సజావుగా పనిచేయించి రైతులకు ఇబ్బంది లేకుండగా చూసుకుంటామన్నారు. మాండ్ర సురేంద్రనాథరెడ్డి, ఓబుల్ రెడ్డి, కొణిదేల గ్రామ సర్పంచ్, నవీన్ రైతు సంఘం నాయకులు శ్రీనివాసరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, షమీమ్ బాషా, మల్లికార్జునరెడ్డి, రైతులు పాల్గొన్నారు.



నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

చదువు ఎవరు చెప్పాలి?

- కొత్తగా ఏర్పాటైన జూనియర్ కళాశాల
- అడ్మిషన్ పొందిన 40 మంది విద్యార్థులు
- ఇప్పటికీ అధ్యాపకులను నియమించని వైనం
- అయోమయంలో విద్యార్థులు



కొత్తపల్లి, జూలై 30: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మండలానికి ఒక జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయడం సంకల్పించింది. అందులో భాగంగా కొత్తపల్లి మండలానికి కూడా జూనియర్ కళాశాల మంజూరైంది. అయితే ఇంత వరకు ఇంటర్ విద్యార్థులకు బోధించే అధ్యాపకులను నియమించకపోవడంతో జూనియర్ ఇంటర్‌లో బైపీసీ, ఎంపీసీ విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. కొత్తపల్లి హైస్కూల్‌లోనే ఇంటర్ విద్యకు సరిపడా గదులు ఉండటంతో హై స్కూల్‌లోనే ఇంటర్ తరగతులను ఏర్పాటు చేశారు. ఇప్పటికే బైపీసీలో 20 మంది, ఎంపీసీలో 20 మంది విద్యార్థులు అడ్మిషన్లు కూడా తీసుకున్నారు. వీరికి ప్రభుత్వం పాఠ్య పుస్తకాలు, నోటుబుక్స్‌ను విడుదల చేసింది. అయితే అధ్యాపకులను ప్రభుత్వం నియమించకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇదివరకే ఎంఈవో శ్రీరాములు ఆదేశాల మేరకు మండలంలోని ఆయా గ్రామాల్లో ఇంటింటి తిరిగి పది పాసైన విద్యార్థుల డేటాను సేకరించి ఆ రెండు గ్రూపుల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 2024-25 విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు చేయించుకున్నారు. అడ్మిషన్లు పొందిన విద్యార్థులు కళాశాలకు వచ్చేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే అధ్యాపకులే లేకపోవడంతో వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందనే చెప్పవచ్చు. ఈ విషయంపై ఎంఈవో శ్రీరాములును వివరణ కోరగా.. ఇంటర్ విద్యను బోధించేందుకు అధ్యాపకులు లేరనే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు.

'నిరుద్యోగాన్ని అరికట్టడంలో విఫలం'



మాట్లాడుతున్న ఎంఏ గఫూర్

నంద్యాల (నూనెపల్లె), జూలై 30: నిరుద్యోగాన్ని అరికట్టడంలో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని సీపీఎం జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ ధ్వజమెత్తారు. నంద్యాలలో జరుగుతున్న డీవైఎఫ్ఐ శిక్షణ తరగతుల కార్యక్రమానికి గఫూర్ హాజరై ప్రసంగించారు. కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు చేయకుండా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను పెంచకుండా కొత్త పరిశ్రమల స్థాపనకు చర్యలు తీసుకోకుండా నిరుద్యోగుల సంఖ్యను పెంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రాము, రామన్న, ఉపాధ్యక్షులు రమణ శివ, నగేష్ పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

- నీటిలో కొట్టుకుపోయిన కారును ఒడ్డుకు చేర్చిన పర్యాటకులు



కారును ఒడ్డుకు చేర్చుతున్నపర్యాటకులు

శ్రీశైలం, జూలై 30: శ్రీశైలం జలాశయంలో కొట్టుకుపోతున్న పర్యాటకుల కారును స్థానికులు, పర్యాటకులు కలిసి ఒడ్డుకు చేర్చారు. వికారాబాద్ జిల్లా దాదాపూర్ గ్రామానికి చెందిన పర్యాటకులు శ్రీశైలం జలాశయం దిగువ ప్రాంతంలోని లింగాల గట్టు బ్రిడ్జి కింద నీటికి సమీపంలో కారును నిలిపి స్నానానికి వెళ్లారు. మూడు గేట్లను తెరిచి నీటిని విడుదల చేస్తున్న జలాశయం అధికారు మరో గేటు తెరువగా ఒక్కసారిగా నీటిమట్టం పెరిగింది. ఆ సమయంలో పర్యాటకులు నిలిపిన కారు నీటి ప్రవాహానికి కొట్టుకుపోతుండగా స్థానికులు గమనించి ఒడ్డుకు చేర్చారు. ఆ సమయంలో కారులో ఎవరూ లేకపోవడంతో తృటిలో పెను ప్రమాదం తప్పింది.

వేంకటేశ్వర స్వామి ఆలయంలో చోరీ

ఆత్మకూరురూరల్, జూలై 30: ఆత్మకూరు మండలం బాపనంతాపురం గ్రామంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఆలయ ధర్మకర్త అక్కిరాజు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని బాపనంతాపురం గ్రామంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం రాత్రి పూజాది కార్యక్రమాలు ముగించుకుని గుడికి తాళాలు వేసి వెళ్లామన్నారు. కాగా గుర్తు తెలియని దుండగులు సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఆలయం గేటుకు ఉన్న తాళాలు కట్టర్‌తో కోసేసి ఆలయంలోకి చొరబడి గుడిలోని బీరువా తాళాలు తీసి బీరువాలో ఉన్న రెండున్నర తులం అమ్మవారి పుస్తెలను, గోశాల నిర్మాణం కోసం ఉంచుకున్న రూ.50 వేల నగదును ఎత్తుకెళ్లారని తెలిపారు. అలాగే తాళాలు పగులగొట్టి హుండీ లో ఉన్న సుమారు రూ.20 వేల నగదును అపహరించుకుని వెళ్లినట్లు తెలిపారు. ఉదయం గుడి బయటి గేటు తాళాలు తెరిచి ఉండటాన్ని గమనించిన ధర్మకర్త గుడిలో ఎవరో చోరీకి పాల్పడ్డారని తెలుసుకుని ఈ మేరకు పోలీసులకు సమాచారం అందించినట్లు గ్రామస్థులు తెలిపారు. ఎస్ఐ వెంకట నారాయణరెడ్డి క్లూస్ టీంతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆలయ ధర్మకర్త పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో నాగసాధువులు



మహానంది ఆలయంలో నాగసాధువులు

మహానంది, జూలై 30: మహానంది క్షేత్రంలో ఉజ్జయిని దత్తాశ్రమంలోని ధుని పైన తపస్సులో ఉండే నాగసాధువులు మంగళవారం స్వయంభులింగమైన నందీశ్వరునికి ప్రత్యేక పూజలు జరిపారు. దక్షిణ భారత తీర్థయాత్రలో భాగంగా మహానంది క్షేత్రానికి దర్శనం కోసం వచ్చినట్లు తెలిపారు. ప్రత్యేక వాహనంలో తిరుపతి నుంచి మహానందికి వచ్చినట్లు నాగ సాధువులు చెప్పారు. ఇక్కడి జలసంపద, స్వయంభు లింగం దేశంలో మరెక్కడ లేదన్నారు. పూజల అనంతరం వీరికి ఆలయ వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంత్‌శర్మ పండ్లు పలహారాలను అందచేశారు.

మట్టి కట్టపై భారీ రంధ్రం



జలాశయ మట్టి కట్టపై ఏర్పడిన రంధ్రం

వెలుగోడు, జూలై 30: వెలుగోడు తెలుగుగంగ జలాశయ మట్టి కట్టపై భారీ రంధ్రం ఏర్పడింది. ఓ వైపు జలాశయానికి భారీగా నీరు చేరుకుంటుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పోతిరెడ్డి పాడు నుంచి బానకచెర్ల మీదుగా వెలుగోడుజలాశయానికి వరద జలాలు భారీగా వచ్చి చేరుతున్నాయి. ఈ నేపథ్యంలో మట్టి కట్టకు ఈ గొయ్యి ఏర్పడటంతో ప్రజలు ఏక్షనంలో ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

ముమ్మరంగా వరినాట్లు



బండిఆత్మకూరు వద్ద ముమ్మరంగా వరినాట్లు

బండిఆత్మకూరు, జూలై 30: మండలంలోని కేసీ కెనాల్ కింద వరి నాట్లు ముమ్మరంగా చేపట్టారు. మండలంలోని పార్నపల్లె, ఎ.కోడూరు, ఈర్నపాడు, బీ కోడూరు, బండిఆత్మకూరు, కాకనూరు గ్రామాల్లోని సుమారు 10 వేల ఎకరాల్లో వరినాట్లు కొనసాగుతున్నాయి. ఎకరాకు రూ.3800 కూలీ వెచ్చించి రైతులు వరి నాట్లు వేయిస్తున్నారు. సకాలంలో కేసీ, కుందూనదిల కింద వరి నాట్లు సాగుతుండటం పట్ల అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పోతిరెడ్డిపాడు నుంచి పెరిగిన నీటి విడుదల



పోతిరెడ్డిపాడు నుంచి విడుదలవుతున్న నీరు

జూపాడుబంగ్లా, జూలై 30: పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి దిగువకు నీటి విడుదలను మంగళవారం నీటి పారుదలశాఖ అధికారులు పెంచి విడుదల చేశారు. సోమవారం ఆరు గేట్ల నుంచి 23వేల క్యూసెక్కులు విడుదల చేయగా, మంగళవారం శ్రీశైలం జలాశయానికి ఎగువ ప్రాంతం జూరాల, తుంగభద్ర ప్రాజెక్టుల నుంచి భారీగా ఇన్‌ఫ్లో 4లక్షలకు పైగా క్యూసెక్కుల వరదనీరు రావడంతో 883.5 అడుగులు వచ్చి చేరాయి. సాయంత్రం 25వేల క్యూసెక్కులకు పెంచి నీటిని ఎస్సార్ఎంసీ కాలువలోకి విడుదల చేశారు. ఆ నీటిని బానకచర్ల నీటిసముదాయం నుంచి తెలుగు గంగ 12వేల క్యూసెక్కులు కేసీ ఎస్కేప్ 5వేల క్యూసెక్కులు, గాలేరు నగరి కాలువకు 8వేల క్యూసెక్కులు మళ్లించినట్లు అధికారులు తెలిపారు.

25 వేల క్యూసెక్కులు విడుదల



మద్దూరు గ్రామ శివార్లలలో పొలాలలోకి చేరుతున్ననీరు

పాములపాడు, జూలై 30: మండలంలోని బానకచెర్ల క్రాస్ హెడ్ రెగ్యులేటర్ నుంచి 25 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు అధికా రులు తెలిపారు. మంగళవారం పోతిరెడ్డిపాడు నుంచి హెడ్‌రెగ్యులేటర్ నుంచి 25వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండటంతో వాటిని బానకచెర్లక్రాస్ హెడ్‌రెగ్యులేటర్ నుంచి 12 వేల క్యూసెక్కులు వీబీఆర్‌కు, 8వేలు గాలేరు, 5వేలు ఎస్కేప్ చానల్ ద్వార నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

పొలాలను ముంచెత్తుతున్న నీరు

ఎస్సార్బీసీ కెనాల్ మరమ్మతులు చేపట్టక పోవడంతో నీటి ఉధృతి పెరగడంతో పంటపొలాలను మునుగుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం మద్దూరు నుంచి తూడిచెర్ల గ్రామాల మధ్యలో గల ఎస్సార్బీసీ కెనాలు వద్ద జోమువాగు వద్ద గతంలో బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టేందుకు చేసిన పనుల కోసం తవ్విన కట్టలను పూడ్చక పోవడం, అధికారులు బానకచెర్ల క్రాస్ హెడ్ రెగ్యులేటర్ నుంచి నీటి విడుదల చేస్తుండటంతో నీరు పొలాలను ముంచుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఓఆర్ఎస్ ద్రావణంపై అవగాహన

మిడుతూరు, జూలై 30: మిడుతూరు కేజీబీవీలో విద్యార్థినులకు ఓఆర్ఎస్ వీక్‌లో భాగంగా వైద్యాధికారి తిరుపతి ఆధ్వర్యంలో మంగళవారం ఓఆర్ఎస్ ద్రావణం ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ సుమలత, నర్సింగ్ ఆఫీసర్ ముర్తుజావలి పాల్గొన్నారు.

రేపే వంద శాతం పూర్తి చేయాలి: ఎంపీడీవో



మాట్లాడుతున్న ఎంపీడీవో రఘురాం

ఉయ్యాలవాడ, జూలై 30: పింఛన్ల పంపిణీని గురువారమే వంద శాతం పూర్తయ్యేలా చేయాలని ఎంపీడీవో రఘురాం సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయా సచివాలయాల కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఉదయం 6 గంటల నుంచే ప్రారంభించి సాయంత్రం 6 గంటలలోపు వంద శాతం పూర్తయ్యేలా చూడాలన్నారు. ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు ఇవ్వాలని ఆదేశించారు.

'పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టండి': పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఈవోపీఆర్డీ మహేంద్రరెడ్డి సూచించారు. కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా 15రోజులకొకసారి గ్రామాల్లోని ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులు, నీటి తొట్టిలను శుభ్రం చేయాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించి గ్రామాల్లోని మురుగుకాల్వలను శుభ్రం చేయించాలని సూచించారు.

దెబ్బతిన్న మొక్కజొన్న పంట పరిశీలన

చాగలమర్రి, జూలై 30: మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో వాతావరణంతో దెబ్బతిని ట్రాక్టర్లతో దున్నేసిన మొక్కజొన్న పంట పొలాలను మంగళవారం ఏవో రంగనేతాజీ పరిశీలించారు. బాధిత రైతులను మొక్కజొన్న పంట సాగు గురించి అడిగి తెలుసుకున్నారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఏవో మాట్లాడుతూ వాతావరణం, తేమ శాతం వల్ల పంట దెబ్బతిని ఉండవచ్చని అన్నారు. సీడు విత్తనాలు కొనుగోలు చేసిన కంపెనీ వారితో చర్చిస్తామని అన్నారు. మొక్కజొన్న సాగు చేసిన పంట పొలాల్లో బోర్లలో కూడా ఫ్లోరైడ్ ఉండవచ్చని, దీని వల్ల కూడా పంట ఎదుగుదల లేక పోయిందని అన్నారు. బోర్లలోగల నీటిని సేకరించి బనగానపల్లెలోని పరిశోధన కేంద్రానికి పంపిస్తామని అన్నారు. దెబ్బతిన్న మొక్కజొన్న మొలకలను పరిశీలించేందుకు శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఆయన వెంట వీపీఏలు రాధాకృష్ణ, మణి, శ్రావణి, రైతులు ఉన్నారు.

కౌలు కార్డులు తప్పనిసరిగా పొందాలి

కోవెలకుంట్ల, జూలై 30: భూములు కౌలుకు తీసుకున్న రైతులు కౌలుకార్డులను తప్పనిసరిగా పొందాలని వ్యవసాయాధికారి నిరంజన్ తెలిపారు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లోని భూ యజమానుల నుంచి భూమిని కౌలుకు తీసుకున్న రైతులు యజమానులను ఒప్పించి కౌలుకార్డులను పొందాలన్నారు. కౌలుకార్డు పొందిన వారికి ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ పథకాలు వర్తిస్తాయన్నారు. అంతేకాకుండా పండించిన పంటను ప్రభుత్వం ద్వారా అమ్ముకునేందుకు వీలవుతుందన్నారు.

వంద శాతం పింఛన్ పంపిణీకి చర్యలు

కొలిమిగుండ్ల, జూలై 30: జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆగస్టు 1వ తేదీనే వంద శాతం పింఛన్ పంపిణీకి చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీవో ప్రసాదరెడ్డి తెలిపారు. మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో వివిధ రకాల పింఛన్లు మొత్తం 7133 ఉన్నాయని, సచివాలయాల వారీగా ఇప్పటికే సిబ్బందిని నియమించామని అన్నారు. మొత్తం రూ.3,064, 2000 పింఛన్ సొమ్ము ప్రభుత్వం ఇప్పటికే విడుదల చేసిందని తెలిపారు.

వీఆర్ఏ మృతికి సంతాపం

బనగానపల్లె, జూలై 30: మండలంలోని యాగంటిపల్లె వీఆర్ఏ చిన్నమద్దిలేటి(48) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. ఆయన మృతిపై గ్రామ సేవకుల సంఘం సంతాపం వ్యక్తం చేసింది. వీఆర్వో వెంకటరామయ్య, మండల గ్రామ సేవకుల అధ్యక్షుడు బాలుడు, సభ్యులు చిన్నమద్దిలేటి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వీఆర్ఏల సంఘం సభ్యులు హరి, సుబ్రహ్మణ్యం. మధు, ప్రసాద్, గోపాల్, రవి, నారాయణ, ప్రసాద్, సుబ్బలక్ష్మమ్మ, మల్లేష్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఫీల్డ్ అసిస్టెంటు మృతి

కోవెలకుంట్ల, జూలై 30: మండలంలోని అమడాల గ్రామ ఫీల్డ్ అసిస్టెంటు బి.తిమ్మయ్య మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. గత కొంత కాలంగా తిమ్మయ్య క్యాన్సర్ వ్యాధితో బాధపడు తుండేవాడు. వైద్యరీత్యా పట్టణాల్లో చూపించుకున్నప్పటికీ కోలుకోలేక మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఉపాధి పథకం ఏపీవో శ్రీవిద్య, ఈసీ మగ్బుల్‌బాషా, టెక్నికల్ అసిస్టెంట్లు జయ భారత్‌రెడ్డి, అమడాలకు చేరుకుని తిమ్మయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

బయో పురుగు మందులను విక్రయించరాదు



రికార్డులు తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారి

అవుకు, జూలై 30: ప్రభుత్వం నిషేధించిన బయో పురుగు మందులను వ్యాపారులు విక్రయిస్తే దుకాణాల లైసెన్స్‌లు రద్దు చేస్తామని వ్యవసాయాధికారి అబ్దుల్‌హక్ అన్నారు. మంగళవారం అవుకు పట్టణంలోని శ్రీనివాస, ఎంసీఎస్ నరసింహులు, భవాని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ వ్యాపారులు దుకాణాల్లో విక్రయిస్తున్న ఎరువులు, పురుగు మందుల నమూనా లను సేకరించామన్నారు. వీటిని నాణ్యత పరిశీలన కోసం ల్యాబ్‌కు పంపుతామన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

కోవెలకుంట్ల, జూలై 30: మండలంలోని అమడాల గ్రామానికి చెందిన బాలదస్తగిరి ఆదివారం గల్లంతైన విషయం తెలిసిందే. సోమవారం అంతా వెతికినా నీటి కుంటలో కనబడక పోవడంతో మంగళవారం ఉదయం మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ వర ప్రసాద్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. అమడాలకు చెందిన బాల దస్తగిరి, అదే గ్రామానికి చెందిన బండెన్నస్వామితో కలిసి కోవెలకుంట్ల సమీపంలోని నీటికుంటలో చేపలు పట్టేందుకు వెళ్లారు. బాలదస్తగిరి చేపలు పడుతుండగా మూర్ఛరావడంతో ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి గల్లంతయ్యాడు. బండెన్న స్వామి బాలదస్తగిరి నీటికుంటలో పడిన విషయం బంధువులకు తెలపడంతో బంధువులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు గజ ఈతగాళ్లను పిలిపించి నీటికుంటలో వెతికించగా మంగళవారం ఉదయం బాలదస్తగిరి మృతదేహం లభ్యమైనట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తిపై దాడి.. ముగ్గురిపై కేసు నమోదు

శిరివెళ్ల, జూలై 30: శిరివెళ్లలోని శివాలయం వద్ద నవీన్‌కుమార్ అనే వ్యక్తిపై సాయి, రాజేష్, ఐ.సాయి అనే వ్యక్తులు సోమవారం రాత్రి చేతులు, కాళ్లతో దాడి చేసి గాయపరచడంతో పాటు చంపుతామని బెదిరించినట్లు ఎస్ఐ సురేష్ మంగళవారం తెలిపారు. ఒకరిపై ఒకరికి ఉన్న మనస్పర్థలతో గొడవకు పాల్పడి దాడి చేశారన్నారు. దీంతో బాధితుడు నవీన్ కుమార్ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ

శిరివెళ్ల, జూలై 30: మండలంలోని కోటపాడు గ్రామంలో రెండు వర్గాలకు చెందిన వ్యక్తులు సోమవారం రాత్రి ఘర్షణకు పాల్పడినట్లు ఎస్ఐ సురేష్ మంగళవారం తెలిపారు. గ్రామంలోని చెన్నకేశవ స్వామి ఆలయ సమీపంలో రెండు వర్గాలకు చెందిన వ్యక్తులు గొడవపడుతూ ప్రజల ప్రశాంతతకు భంగం కలిగించడంతో ఇరు వర్గాలకు చెందిన సుధాకర్, నాగరాజు, వెంకట సుబ్బయ్య, సునీల్, హుసేన్, నందుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పోలీసుల బదిలీలపై నీలి నీడలు

» ముందుకు సాగని ప్రక్రియ
» ఎదురు చూస్తున్న పోలీసు అధికారులు
» విధి నిర్వహణపై నిరాసక్తత



కొలిమిగుండ్ల, జూలై 30: రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరి 50 రోజులు పూర్తి చేసుకుంది. ప్రభుత్వ పాలనలో ముఖ్యమంత్రి, మంత్రులు బిజీ బిజీగా మారారు. కింది స్థాయి పోలీసు శాఖలో మాత్రం నిరాసక్తి నెలకొంది. దీనికి ప్రధాన కారణం వివిధ స్థాయిల్లో పోలీసు అధికారుల బదిలీల ప్రక్రియపై నీలి నీడలు కమ్ముకోవడమే. వాస్తవానికి కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే పైనుంచి కింది వరకు పోలీసు శాఖను పూర్తిగా ప్రక్షాళన చేస్తారని అంతా భావించారు. గతంలో ఏన్నడూలేని విధంగా వైసీపీ హయాంలో అత్యధిక మంది పోలీసులు ఆ పార్టీతో అంటకాగి, ఏకపక్షంగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. ఈ పరిస్థితుల్లోనే బదిలీలు తప్పవన్న రీతిలో పోలీసు అధికారులు సైతం ఆ దిశగా సంసిద్ధమయ్యారు. డీఎస్పీలతోపాటు, సీఐలు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు సైతం బదిలీల కోసం ఎదురుచూసే పరిస్థితి నెలకొంది. అయితే శాంతి భద్రతలతోపాటు, పరిపాలనలో కీలకమైన పోలీసు శాఖ బదిలీలపై కూటమి ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేస్తోంది. జిల్లా స్థాయి ఎస్పీల బదిలీ విషయంలోనే నెల రోజులకు పైగా సమీక్షించి, అనేక అంశాలను పరిగణలోకి తీసుకొని కసరత్తు చేసిన ప్రభుత్వం చివరకు ఇటీవల నంద్యాల ఎస్పీతో సహా రాష్ట్రంలో 37మందిని బదిలీ చేసింది. గత ప్రభుత్వ హయాంలో అత్యుత్సాహం ప్రదర్శించిన అనేక మంది ఎస్పీలను అప్రాధాన్య పోస్టింగులకు సాగనంపింది.

విధి నిర్వహణపై నిరాసక్తి: జిల్లా వ్యాప్తంగా అన్ని డివిజన్లు, సర్కిళ్ల పరిధిలో పోలీసు అధికారులంతా వైసీపీ హయాంలో నియమించిన వారే నేటికీ పనిచేస్తున్నారు. వివిధ స్థాయిల్లో పని చేస్తున్న ఇలాంటి పోలీసు అధికారులు బదిలీ కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో వారు విధి నిర్వహణపై కూడా నిరాసక్తిగా పనిచేస్తున్నారన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. తమ పోస్టింగ్‌కు సహకరించిన వైసీపీ నేతల మాటను కాదనలేక, అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు అనుకూలంగా వ్యవహరించలేక తలలు పట్టుకుంటున్నారు. నిరాసక్తితో కొన్ని ప్రాంతాల్లో పోలీసు అధికారులు స్టేషన్లకే సరిగ్గా రావడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక ప్రజల నుండి వచ్చే వివిధ రకాల ఫిర్యాదులు, వివాదాస్పద సమస్యలపై పోలీసులు ఏమాత్రం స్పందించడం లేదు. ఎటూ వెళ్లిపోయే వాళ్లం మనకెందుకులే అన్న రీతిలో విధులను పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పోస్టింగ్‌ల కోసం ప్రదక్షిణలు: మరోవైపు తమకు అనుకూలమైన స్థానాల కోసం అనేక మంది పోలీసు అధికారులు ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. అవకాశం ఉన్న డీఎస్పీ స్థాయి అధికారులతో పాటు, సీఐలు, ఎస్ఐలు తమకు నచ్చిన స్థానాలపై కన్నేసి, ఎలాగైనా దక్కించుకోవాలనే ప్రయత్నాలను ముమ్మరం చేశారు. జిల్లా మంత్రులతోపాటు, ఆయా నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేల వద్దకూ క్యూ కడుతున్నారు. ప్రధానం జిల్లాలో ఆదాయం కలిగిన స్టేషన్లుగా పేరుగాంచిన కొలిమిగుండ్ల, బేతంచెర్ల, డోన్, వెల్దుర్తి తదితర సర్కిళ్లలో పని చేయడానికి పలువురు అధికారులు ఆసక్తి కనబరుస్తున్నట్లు పోలీసు శాఖలో చర్చ నడుస్తోంది. అయితే బదిలీల ప్రక్రియ మాత్రం అడుగు ముందుకు మూడడుగులు వెనక్కి అన్నచందంగా మారింది. ఏదిఏమైనా బదిలీల ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేసి పరిపాలన సవ్యంగా నడిచేలా చూడాలని వివిధ వర్గాల ప్రజలు కోరుతున్నారు.

రాజోలి ఆనకట్ట వద్దకు చేరిన కృష్ణా జలాలు

6,200 క్యూసెక్కుల నీటి ప్రవాహం



రాజోలి ఆనకట్టపై పొంగి ప్రవహిస్తున్న వరద నీరు

చాగలమర్రి, జూలై 30: మండలంలోని రాజోలి ఆనకట్ట వద్దకు మంగళవారం కృష్ణా జలాల వరద నీరు ఆనకట్టకు చేరాయి. శ్రీశైలం, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి వరద నీరు ఆనకట్టకు చేరింది. దీంతో కుందూ ఉధృతి పెరిగింది. ఆనకట్ట వద్ద కుందూనది 6,200 క్యూసెక్కుల నీటితో ప్రహిస్తున్నట్లు కేసీ కెనాల్ ఏఈ జమాల్‌వలి తెలిపారు. నెల రోజుల నుంచి సరైన వర్షాలు లేకపోయిన కృష్ణాజలాలు రావడంతో కుందూనది వరద నీటితో ప్రవహిస్తోందని అన్నారు. ఆనకట్ట వద్ద కేసీ కాలువకు గల ప్రధాన గేట్లను మూసి వేసి కడప జిల్లావైపు గల గేట్లను ఎత్తి కుందూకు నీరు విడుదల చేశామని అన్నారు. కుందూలో నీరు ప్రవహిస్తుండటంతో పరిసర గ్రామాల పొలాల్లోని బోర్లకు నీటి మట్టం పెరుగుతుందని అన్నారు. కేసీ ప్రధాన కాలువకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నీరు విడుదల చేయనున్నట్లు తెలిపారు.

'రికార్డులు సక్రమంగా ఉండాలి'

రుద్రవరం, జూలై 30: రుద్రవరం పోలీసు స్టేషన్‌లో రికార్డులు సక్రమంగా ఉండాలని సీఐ చంద్రబాబు అన్నారు. మంగళవారం రుద్రవరం పోలీసుస్టేషన్‌లో తనిఖీలు చేశారు. రికార్డులను పరిశీలించారు. ప్రతి రికార్డులన్నీ అప్‌డేట్‌గా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సిబ్బందిని సీఐ ఆదేశించారు.

వరి నాట్లు ప్రారంభం



డి. కొట్టాల సమీపంలో వరినాట్లు వేస్తున్న కూలీలు

రుద్రవరం, జూలై 30: మండలంలో వ్యవసాయ బోరుబావుల కింద వరినాట్లు సాగు చేయడంలో రైతులు నిమగ్నమయ్యారు. యల్లావత్తుల, డి.కొట్టాల, కొండమాయపల్లె, చిత్తరేణిపల్లె గ్రామాల్లో వరినాట్లు సాగు చేయడంలో రైతులు ముందున్నారు. వ్యవసాయ బోరుబావుల్లో ఇటీవల కురిసిన వర్షాలకు భూగర్భజలం పెరిగింది. బోరుబావుల్లో నీరు పుష్కలంగా అందడంతో వరినాట్లు సాగు చేస్తున్నారు.

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి



ప్రసంగం వింటున్న భక్తులు

బనగానపల్లె, జూలై 30: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని హిందూధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని యనకండ్ల గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో మల్లు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించారు. శ్రీకృష్ణమందిరంలో ధార్మిక ప్రవచకురాలు సుబ్బలక్ష్మమ్మ శ్రీమద్రామాయణంపై ఆధ్యాత్మిక ప్రసంగం భక్తులకు వినిపించారు. కార్యక్రమంలో వడ్డె చిన్నశివయ్య, శివరాముడు, బాలతిమ్మయ్య, దాట్ల శ్రీరాములు, పెండేకంటి వెంకసుబ్బయ్య, రామ చంద్రుడు, బ్రహ్మయ్య కృష్ణయ్య గౌడ్, వెంకటసుబ్బయ్య, జ్యోతి గంగా దేవి, శేషన్న, జానకి రాముడు, రామసుబ్బయ్య పాల్గొన్నారు.

లారీలు ఢీకొని.. ఇద్దరికి తీవ్ర గాయాలు

కొలిమిగుండ్ల, జూలై 30: మండలంలోని కనక్రాదిపల్లె గ్రామ సమీపంలో శక్తిపురం వద్ద రెండు లారీలు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం అర్ధరాత్రి చోటు చేసు కుంది. శక్తిపురం మలుపు వద్ద రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొ న్నాయి. తమిళనాడుకు చెందిన డ్రైవర్ తలావన్, మరో లారీ డ్రైవర్ పెనుగొండకు చెందిన నరసింహులుకు తీవ్ర గాయాలు కావడంతో 108 సిబ్బంది, పోలీసులు డ్రైవర్లను ఆసుపత్రికి తరలించారు. సీఐ గోపినాథ్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి పూజలు

కొలిమిగుండ్ల, జూలై 30: కొలిమిగుండ్లతోపాటు మండలంలోని అంకిరెడ్డిపల్లె, కల్వటాల, బెలుం, లొక్కిగుండం, హనుమంతుగుండం గ్రామాల్లో ఆషాఢ మాసం ఆడికృతిక నక్షత్రం పురస్కరించుకొని మం గళవారం సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాలకు చెందిన భక్తులు ఆలయాలకు వెళ్లి అభిషేకాలు, తదితర పూజలు నిర్వహించారు.

ఎమ్మెల్యే చొరవతో ఆర్టీసీ బస్సు

శిరివెళ్ల, జూలై 30: కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిలోని యర్రగుంట్ల నుంచి గుంప్రమాన్‌దిన్నె, రాజనగరం మీదుగా దొర్నిపాడు వరకు ఆర్అండ్‌బీ రహదారి నిర్మించినప్పటికీ ఏళ్ల తరబడి బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు గ్రామాల ప్రజలు, టీడీపీ నాయకులు సమస్యను ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ దృష్టికి తీసుకెళ్లగా ఆమె ఆర్టీసీ రీజనల్ మేనేజర్‌తో మాట్లాడారు. దీంతో నంద్యాల నుంచి యర్రగుంట్ల, గుంప్రమాన్‌దిన్నె, రాజనగరం, డాక్టర్ కొట్టాల మీదుగా దొర్నిపాడు గ్రామానికి ప్రతి రోజూ ఉదయం, మధ్యాహ్నం వేళల్లో ఆర్టీసీ బస్సు వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించడంతో ఆయా గ్రామాల్లోని ప్రజలు, విద్యార్థులు, టీడీపీ గుంప్రమాన్‌దిన్నె నాయకుడు కుందూరు మోహన్ రెడ్డి తదితరులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

తపాలా కార్యాలయంలో ఆధార్ సేవలు

శిరివెళ్ల, జూలై 30: శిరివెళ్లలోని తపాలా కార్యాలయం(పోస్టాఫీస్)లో ప్రతిరోజూ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి ఆధార్ సేవలు అందిస్తున్నట్లు సబ్ పోస్ట్ మాస్టర్ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. ఆధార్‌కు ఫోన్ నంబర్ లింక్ చేయడం, బయోమెట్రిక్ నమోదు, పేరు, చిరునామా సవరణ, మాండటరీ అప్‌డేట్ తదితర సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఉయ్యాలవాడ, జూలై 30: మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రఘురాం మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ సమావేశంలో ఆయా గ్రామాల అభివృద్ధి, సమస్యల పరిష్కారంపై చర్చిస్తామన్నారు. సమావేశానికి అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జడ్పీటీసీ అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

ఒలింపిక్స్‌లో విజయం దేశానికి గర్వకారణం

కొలిమిగుండ్ల, జూలై 30: పారిస్ ఒలింపిక్స్‌లో మన క్రీడాకారులు విజయం సాధించి, పతకాలు తీసుకరావడం దేశానికి గర్వకారణమని మండల జనసేన అధ్యక్షుడు గుజ్జల పెద్దయ్య అన్నారు. మంగళవా రం ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు మనూ బాకర్, సరబ్ జోత్ సింగ్‌లు ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించారన్నారు.

పేదల ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు: ఎమ్మెల్యే కోట్ల



ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కోట్ల

డోన్, జూలై 30: టీడీపీ కూటమి ప్రభుత్వంలో పేదల ఇంటి నిర్మాణానికి రూ.4లక్షలు ఇచ్చేలా సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారని డోన్ ఎమ్మెల్యే కోట్ల ప్రకాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని పాతపేటలో ఆయా కాలనీల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మహిళలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసున్నారు. అనంతరం కోట్ల మాట్లాడుతూ రాష్ట్రంలోని పేదలకు సీఎం చంద్రబాబు డబుల్ బోనంజా ప్రకటించారన్నారు. పట్టణ ప్రాంతాల్లో పేదకు 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల స్థలం ఇవ్వడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో అర్హులైన వారందరికి స్థలాలు ఇవ్వడంతో పాటు పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. డోన్ మున్సిపాలిటీలో వార్డుల్లో ప్రజలకు వసతులు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జయరాం, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోట్రిక ఫణిరాజ్, వలసల రామక్రిష్ణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మేన్ కేశన్నగౌడు, మాజీ సర్పంచు కేశవయ్యగౌడు, మున్సిపల్ వైస్ చైర్మేన్ కోట్రిక హరికిషన్, జిల్లా అధికార ప్రతినిధి విజయ్‌భట్టు, ఓబులాపురం శేషిరెడ్డి, సర్పంచు రేగటి అర్జున్‌రెడ్డి, సుదీష్, ఓంప్రకాష్, అన్వర్‌బాషా పాల్గొన్నారు.

ప్రతిపాదనలు సిద్ధం చేయండి: డోన్ నియోజకవర్గంలో తాగునీటి సమస్య తాగునీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించాలని సంబంధిత అధికారులను కోట్ల ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని తన నివాసంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో ఆయా గ్రామాల నుంచి తాగునీటి సమస్య ఉన్నట్లు ఫోన్లు వస్తున్నాయని అలాంటి గ్రామాలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రమేష్‌రెడ్డిని కోట్ల ఆదేశించారు. అలాగే నియోజకవర్గంలో రహదారుల సమస్య ఉన్న గ్రామాలను గుర్తించాలని పంచాయతీరాజ్ శాఖ డీఈ నాగిరెడ్డి, ఏఈ నారాయణలను ఆదేశించారు.

'విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు'



ముత్యాలపాడు వైద్యశాలలో
రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ టీమ్

చాగలమర్రి, జూలై 30: వైద్యశాఖలో పని చేసే వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని టాస్క్‌ఫోర్స్ జిల్లా డీపీఎంవో సనీత, జిల్లా గణాంకాధికారి సుజాత హెచ్చరించారు. మంగళవారం ముత్యాలపాడు ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఆరోగ్య కార్యక్రమాలపై పరిశీలించారు. చిన్నారులు, గర్భిణులు, యుక్త వయసు బాలికల రక్త పరీక్షల రిపోర్టులను పరిశీలించారు. జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్.నజీనీన్, జిల్లా డేటా మేనేజర్ శివకుమార్, వైద్యులు తస్లిమ్ సుల్తాన, ఆరోగ్య విస్తరణాధికారులు వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, సూపర్‌వైజర్ మల్లేశ్వరి, సీహెచ్‌వో, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుపై అవగాహన

చాగలమర్రి, జూలై 30: మండలంలోని పెద్దబోదనం గ్రామంలో పండ్ల తోటల సాగుపై ఏపీవో నిర్మల ఆధ్వర్యంలో మంగళవారం రైతుకు అవగా హన కల్పించారు. వందశాతం సబ్సిడీతో రైతులకు ఉపాధి నిధులు మంజూ రు చేయనున్నట్లు తెలిపారు. టీఏ, ఎఫ్ఏ, వీహెచ్ఏ, రైతులు పాల్గొన్నారు.

టీడీపీ సానుభూతిపరుడి మృతికి సంతాపం

చాగలమర్రి, జూలై 30: చాగలమర్రి గ్రామంలోని పాతబస్టాండు సమీపంలో నివాసం ఉంటున్న టీడీపీ సానుభూతి పరుడు ఎ.రాముడు (62) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్వర్‌బాషా, టీడీపీ నాయకులు కొలిమి ఉసేన్‌వలి, మౌళాలి, అనీఫ్, ఖలీల్ మృతుడి నివాసం వద్దకు వెళ్లి మృతదేహంపై పూలమాల వేసి సంతాపం ప్రకటించారు. కుటుంబం పట్ల సానుభూతి తెలిపారు.

పింఛన్‌ల పంపిణీకి ప్రత్యేక అధికారుల నియామకం

చాగలమర్రి, జూలై 30: మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ల పంపిణీ కార్యక్రమానికి ప్రత్యేక అధికారులను నియమించినట్లు ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 17 గ్రామ సచివాలయాలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. చాగలమర్రికి ఇన్‌చార్జి తహసీల్దార్ విజయ్‌కుమార్, చిన్నవంగలి, చింతలచెరువు, పెద్దవంగలి గ్రామాలకు ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, డి.వని పెంట, గొడిగనూరు, శెట్టివీడు గ్రామాలకు పీఆర్ ఏఈ కొండారెడ్డి, మల్లేవే ముల, ముత్యాలపాడు గ్రామాలకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగ్గయ్య, నేలంపాడు, మద్దూరు, పెద్దబోదనం గ్రామాలకు ఏవో రాజేంద్రప్రసాదును నియమించినట్లు ఎంపీడీవో సుర్యనారాయణరెడ్డి చెప్పారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

చాగలమర్రి, జూలై 30: మండలంలోని శెట్టివీడు గ్రామంలోగల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల కోసం తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవో న్యామతుల్ల మంగళవారం పరిశీలించారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. హెచ్ఎం లక్ష్మీకుమారి, ఉపాధ్యాయులు ఉన్నారు.

'అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

రుద్రవరం, జూలై 30: ఎరువులు, పురుగు మందులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏవో శ్రీకృష్ణ హెచ్చరించారు. మంగళవారం వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని ఎరువుల దుకాణం నిర్వహిస్తున్న యజమానులు దుకాణం వద్ద ధరల పట్టిక తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో రాజు, వీపీఏలు ఫణింద్రకుమార్, శ్రావణి, నాగశ్రీ తదితరులు ఉన్నారు.

మహిళపై అసభ్య ప్రవర్తన : కేసు నమోదు

అవుకు, జూలై 30: అవుకు పట్టణం మండపం వీధికి చెందిన తాళ్ళపల్లి కిశోర్ అనే వ్యక్తి మహిళపై అసభ్యంగా ప్రవర్తించటంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్‌బాబు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నిందితుడు కిశోర్‌కుమార్ మహిళకు తరచూ ఫోన్లు, మెసేజ్‌లు, వీడియో కాల్స్ చేస్తూ లైంగిక వేధింపులకు గురి చేస్తున్నట్లు బాధిత మహిళ ఫిర్యాదు చేసిందన్నారు.

క్రిమి సంహారక మందులను తగ్గించండి

సంజామల, జూలై 30: రైతులు క్రిమి సంహారక మందుల వినియోగం తగ్గించాలని మండల వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి కోరారు. మంగళవారం బొందలదిన్నె గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి వ్యవసాయ అధికారి మాట్లాడారు పంటలపై క్రిమి సంహారక మందులు పిచికారి చేయడం వల్ల క్రిమి సంహారక అవశేషాలు ఎక్కువగా ఉంటాయని అలాంటి పంటల ఉత్పత్తులను మార్కెట్‌లో డిమాండ్ ఉందన్నారు. పురుగు మందులు లేకుండా కషాయాలు, వేపనూనె పంటలకు పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో వీపీఏలు, గ్రామ నాయకులు హరినాథ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మేలు రకమైన మొక్కలు సాగు చేయండి



మొక్కలను నాటేందుకు గుంతలను పరిశీలిస్తున్న ఎంపీడీవో

సంజామల, జూలై 30: ఎన్.ఆర్.ఈ.జి.ఎస్ పథకం ద్వార పండ్ల తోటలు సాగు చేస్తున్న రైతులు మేలురకమైన మొక్కలను సాగు చేయాలని ఎంపిడిఓ విజయ్‌కుమార్ రెడ్డి కోరారు. మంగళవారం ఎపిఓ సూర్యప్రకాష్‌తో కలిసి మండలంలోని కాణాల, గిద్దలూరు గ్రామాల్లో సాగు చేస్తున్న పండ్ల తోటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో మొక్కలకు గుంతలు తీసే పనులు చేపడుతున్నామని ప్రతి కూలికి దినసరి వేతనం 300వచ్చేలా పనులు చేయాలన్నారు.

ఆర్‌బీకేకు అనుసంధానంగా ప్రైవేటు భవన నిర్మాణం

అభ్యంతరం తెలుపుతున్న రైతులు



ఆలమూరులో నిర్మిస్తున్న భవనం

రుద్రవరం, జూలై 30: మండలంలోని ఆలమూరు గ్రామంలో రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం నిర్మాణం చేపట్టారు. రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు నిర్మాణం చేపట్టారు. అయితే మరో వ్యక్తి ఆ భవనానికి అనుసంధానం చేసి మరో భవనం నిర్మిస్తున్నారని రైతులు అభ్యంతరం తెలిపారు. ఈ విషయాన్ని అటు పంచాయతీ రాజ్ శాఖ, ఇటు వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. అలా నిర్మిస్తే ఎలా అని గ్రామ రైతులు ప్రశ్నిస్తున్నారు. పంచాయ తీరాజ్ ఏఈ వెంకట్రాముడు మాట్లాడుతూ రైతుభరోసా కేంద్రాన్ని 2023 మార్చి 27న అప్పటి ఎమ్మెల్యే ప్రారంభించారని, ఆ భవనాన్ని వ్యవసాయ శాఖకు అప్పగించామని చెప్పారు. ఏవో శ్రీకృష్ణ మాట్లాడుతూ భవనాన్ని మాత్రమే అప్పగించారని, అయితే చుట్టూ ఉత్తర దక్షిణం, తూర్పు పడమర హద్దులు చూపించలేదని చెప్పారు. ఆ రైతులకు చెప్పి పనులు ఆపిస్తా మన్నారు.